## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

కొల్లిపర: మే 13న రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జై భీమ్ ఫెడరేషన్ సభ్యులు ఓటర్లను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పోటా కుంచవరం దంతలూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు కె.దేవానంద్, సుమతి, ఆశా, డేవిడ్ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పరశురామ జయంతి



తెనాలి: బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థ కార్యాలయంలో పరశురామ జయంతిని నిర్వహించారు. పరశురాముని చిత్రపటానికి సంప్రదాయ పూజలు చేశారు. శుక్రవారం ఎంతో శుభదినమని, పరశురామ జయంతితో పాటు అక్షయ తృతీయ, శ్రీకృష్ణుడు కుచేలుని కలిసిన రోజు, అరణ్య వాసంలో ఉన్న పాండవులకు అక్షయపాత్ర అందిన రోజుగా ఈ రోజు ఎంతో పవిత్రమని పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావు పరశురామ జయంతి నిర్వహణ ఆవశ్యకతను తెలియజేశారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, త్రిపురారిభట్ల దత్తాత్రేయ శర్మ, మల్లేపల్లి ఆదిశేషగిరిరావు, బ్రాహ్మణ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యుడు ఎన్ఆర్‌కే శర్మ, చెన్నాప్రగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్‌వీఎన్ కాలనీలో నివాసం ఉండే బత్తుల ప్రభురాజ్‌కుమార్(18) ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. మానసికంగా కుంగిపోయి శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

### వివాహిత అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యానగర్‌లో నివాసం ఉండే 24 సంవత్సరాల సాయిసన్నిధి శుక్రవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అంబేడ్కర్‌ను గౌరవించలేని కూటమికి ఓట్లు వేయాలా!

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎత్తైన విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేస్తే ఆయనకు కనీస నివాళులర్పించలేని కూటమి నేతలకు ఏ విధంగా ఓట్లు వేయాలని మాదిగల లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పుసులూరి జీవా డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడకు పలు మార్లు వస్తున్న ప్రధాని మంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఒక్క పూల మాల వేసి ఆయనకు నివాళులర్పించలేదంటే అంబేడ్కర్‌ను అవమానించినట్లే అన్నారు. పైగా కూటమి అధికారంలోకి వస్తే అంబేడ్కర్ విగ్రహాన్ని తీవవేస్తామని పొన్నూరు అభ్యర్థి దూళిపాళ్ల నరేంద్ర మాట్లాడం చూస్తే దళితులంటే ఎంత చులకనో అర్థమవుతుందని పేర్కొన్నారు. కనీసం దళితులకు ఆత్మగౌరం కోసమైన పేద వర్గాల దేవుడైన అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించని దళిత ద్రోహి మంద కృష్ణమాదిగ నైజం అర్థమవుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులంతా ఓట్లు వేసి తిరిగి సీఎంని చేసుకోవాలని కోరారు.

### ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయ సాంకేతిక దినోత్సవం

గుంటూరు రూరల్: ఆర్ వీఆర్ జేసీలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల అద్భుత సేవలను స్మరించుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యతన్నారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగిన ప్రొటోటైప్, హ్యాకథాన్, పోటీలలో విజయాలు సాధించిన కళాశాల విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కె కృష్ణప్రసాద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె ప్రవీణ్, డాక్టర్ కె శోభ, డాక్టర్ ఎన్ ధరణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేను పక్కా లోకల్..

- 'లోకల్ శివన్న' అని అనిపించుకున్నా.
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నా
- సంక్షేమాభివృద్ధిని చేసి చూపా
- 800 ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించా
- ఏటా వేలాదిమంది యువతకు ప్రైవేటు ఉద్యోగాలు వచ్చేలా కృషి
- కరోనా రోజుల్లోనూ బాధితులకు సేవలందించా
- జనసేన నాయకులు ఉత్సవాలకూ నేనే హాజరయ్యా
- ఎన్నికల్లో జనసేన అభ్యర్థులకు ఒక్కరోజూ కూడా ప్రచారం చేయని నాదెండ్ల
- వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్



సాక్షి ఇంటర్వ్యూ

తెనాలి నా నివాసం. నా తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా చేశారు. ఆయన హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పటికీ కనిపిస్తోంది. ఆయన స్థాపించిన డిగ్రీ కాలేజీకి 21 ఏళ్ల వయసులో కరస్పాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపాను. ఏటా వేలాది మందికి క్యాంపస్ ఉద్యోగాలతో జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశం, ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికై, గత అయిదేళ్ల ప్రజలకు అందుబాటులో ఉన్నా.. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ 'లోకల్ శివన్న'గా పిలిపించుకున్నా. సంక్షేమాభివృద్ధిని చేసి, చూపించాను. మళ్లీ అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధిని సాధిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో హామీనిచ్చారు. – తెనాలి

**మా చిత్తశుద్ధికి నిదర్శనం ఇవీ...**

ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకున్న సంక్షేమ పథకాలను గరిష్టంగా అందజేశాను. రూ.1,800 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. రికార్డు స్థాయిలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చాను. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అధునీకరించాను. నాలుగు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు, కొల్లిపరలో రూ.8.75 కోట్లతో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాను. ప్రతి గ్రామంలోనూ ఆర్‌బీకే సెంటర్లు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి, పీహెచ్‌సీలను అప్‌డేట్ చేశాం. మొత్తం 160 రోడ్లు, అనేక మురుగు కాల్వలను నిర్మించగలిగాం. 35 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోని అంగలకుదురు–కోపల్లె–గుడివాడ రోడ్లు నిర్మాణం మా చిత్తశుద్ధికి నిదర్శనం.

**800 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 80 సచివాలయాల్లో 800 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన అదృష్టం నాకు దక్కింది. ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏఎస్ఎన్ కళాశాల సంయుక్తంగా జాబ్ మేళాలను జరిపి, ఏటా రెండు వేల మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించాం. అంతకు ముందు ఎమ్మెల్యేలుగా చేసిన నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజా ఏ ఒక్కరికైనా ప్రభుత్వం ఉద్యోగం ఇప్పించారా? 2014 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం అన్నారు. ఒక్క ఇంట్లోనైనా ఉద్యోగం ఇచ్చారా?

**'నాదెండ్ల' కాంట్రాక్టర్‌కు పెండింగ్ దబ్బులు ఇప్పించా**

పెదరావూరు–ఆటో నగర్ మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణాన్ని అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నపుడు నాదెండ్ల మనోహర్ చేపట్టారు. 15 ఏళ్లుగా అది పూర్తి కాలేదు. కాంట్రాక్టరుకు పెండింగులో ఉన్న రూ.1.68 కోట్లు నేను ఇప్పించాను. కఠెవరం నుంచి ఆటోనగర్ వరకు సింగిల్ వే వేయించాను. రెండో వైపు కాల్వకు రివిట్ మెంట్ చేస్తుండగా కంట్రాక్టరు అదృశ్యమయ్యాడు. మళ్లీ నాదెండ్ల మనోహర్ జనసేన అభ్యర్థిగా పోటీచేస్తూ, ఓ హోటల్లో నిర్వహించిన కమ్మ సామాజికవర్గం ఆత్మీయ సమావేశంలో ఆయనతో పాటు ప్రత్యక్షమయ్యాడు. పనులు ఆగిపోవటానికి కారణం మనోహరే అని చెప్పాలి.

**జనసేన కార్యక్రమాలకూ హాజరయ్యా..**

సామాన్యుడు సైతం పిలిస్తే ఎమ్మెల్యే వస్తాడు... నేను ఎప్పుడైనా వెళ్లి కలవొచ్చు...అనుకునేలా తెనాలి ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వామిగా ఉన్నా. గత అయిదేళ్లలో 6,254 కార్యక్రమాలకు హాజరయ్యా. నియోజకవర్గంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలకు నేనే వెళ్లా. వారు ప్రారంభించిన షాపులనూ ప్రారంభించా. ఏనాడైనా మనోహర్ వచ్చారా? అని ఆ పార్టీ నాయకులు ఆలోచన చేయాలి.

**అప్పుడేమయ్యాడు..నాదెండ్ల..**

జనసేన అభ్యర్థిగా 2019లో పోటీచేసి 28 వేల ఓట్లు తెచ్చుకున్న నాదెండ్ల మనోహర్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తే ఒక్కరోజైనా ఎన్నికల ప్రచారానికి వచ్చారా? ఎవరికైనా ఆర్థిక సాయం చేశారా? ఇప్పుడేమో ఎన్నికలకు రెండు నెలల ముందు పార్టీ క్యాడర్‌తో సంబంధం లేకుండా నేరుగా వచ్చి పోటీ చేస్తుంటే ప్రజలేమైనా పిచ్చోళ్లా...

**తెనాలి ఎమ్మెల్యేగా గెలిపిస్తే..**

– తెనాలిలో పారిశ్రామిక యూనిట్లు రాకపోవటానికి ప్రధాన కారణం తెనాలి డెల్టా ప్రాంతం కావటమే. వ్యవసాయ ప్రధానమైన ఈ ప్రాంతంలో వ్యవసాయ అనుబంధ యూనిట్ల ఏర్పాటుకు కృషిచేస్తాను. తద్వారా రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఉపాధి అవకాశాలు వస్తాయి.

**లాక్‌డౌన్‌లో అండగా ఉన్నా..**

కరోనా రోజుల్లో అర్ధరాత్రి ఫోను చేసినా, ఆసుపత్రిలో పడకలు, ఆక్సిజను అందేలా చూశా. బాధితులకు ఫోన్లు చేసి ధైర్యం చెప్పాను. వైద్య సాయం వెంటనే అందేలా చూశా. హెల్ప్ డెస్క్‌లు పెట్టించా. పార్టీ వర్గాలతో నిత్యావసరాలు, కూరగాయలను అందించా. అన్నదానం చేయించాను. కరోనా బారిన పడినా సరే. ఏ ఒక్క సేవకు అవరోధం లేకుండా చూశాను. తెనాలిలో సొంత ఇల్లు ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో ఉండే నాదెండ్ల మనోహర్ కరోనా రోజుల్లో తెనాలికేసి తొంగి చూడలేదు.



## అన్ని వర్గాలను ఆదుకున్నాం



జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు, ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

- అసోసియేషన్ భవన నిర్మాణాలకు కృషి
- వైఎస్సార్ సీపీ తెనాలి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలను అదుకున్నట్లు తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వివాహ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించే అన్ని విభాగాల అసోసియేషన్ నాయకులతో బోసు రోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివకుమార్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఐదేళ్లలో ఏ సంస్థను ఇబ్బంది పెట్టలేదని గుర్తుచేశారు. తెనాలి పట్టణంలో 14 అసోసియేషన్‌ల భవనాలు నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. కల్యాణ మండపం, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్స్, డెకరేషన్, లైటింగ్ వంటి అనేక విభాగాల్లో వందలాది మంది జీవిస్తున్నారన్నారు. తెనాలి నియోజకవర్గంలో 27వేల మందికి నివాస స్థలాలు ఇచ్చామని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో అందరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసిందని గుర్తుచేశారు. అందరూ వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ శ్రీ సాయి హరేరామ్, క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు శేషాచలం, నాయకులు జిలానీ, శ్రీనివాసరావు, హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ ప్రతినిధులు కె.రమాకాంత్, సతీష్ రెడ్డి, క్యాటరర్స్ అసోసియేషన్ అయ్యప్ప, రవి, డెకరేషన్ అసోసియేషన్ నాయకులు కాలేషా, మీరావళి, పట్టణ రంగస్థల కళాకారులు సంఘ నాయకులు సత్యనారాయణశెట్టి, డోలు, సన్నాయి కళాకారుల సంఘ నాయకులు శేషావతారం, బ్యాండ్ అండ్ ఆర్కెస్ట్రా నాయకులు షేక్ చిన్న బాజీ, వీడియో గ్రాఫర్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఫ్రాంక్లిన్, ప్రభాకర్, కృష్ణ, ఈవెంట్ అండ్ వెడ్డింగ్ ప్లానర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీకాంత్, వివిధ అసోసియేషన్ నాయకులు షేక్ సైదా, వుప్పల వరదరాజులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కమిటీ సభ్యులు

**మండపాటి శేషగిరిరావుకు అభినందన**

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మండపాటి శేషగిరిరావు ఆత్మీయ అభినందన సభ కొలకలూరు గ్రామంలో వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, రమేష్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఉన్నత పదవులు వస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. మాదిగలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందనేదానికి తనకు ఇచ్చిన జిల్లా అధ్యక్ష పదవే నిదర్శనమన్నారు. అందరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం శేషగిరిరావు, శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. పినపాటి అనిల్, మల్లవరపు భారత్, మల్లవరపు బాబీ, కొలకలూరు పాపారావు, మల్లవరపు బుల్లయ్య, మన్నవ ప్రభాకర్, కొమ్ము రాయల్, బూరెల దుర్గ పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవాట్రస్ట్ సభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సన్మానించి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని మద్దతు తెలిపారు.

## 19న అన్నమయ్య పాటల పోటీలు



పోస్టరు ఆవిష్కరించిన నిర్వాహకులు

తెనాలి: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఈ నెల 19న స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని గీతా మందిరంలో అన్నమయ్య పాటల పోటీలను నిర్వహించనున్నారు. శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు నాలుగు కేటగిరీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. 6–12 సంవత్సరాల వారు జూనియర్–1గా, 13–20 సంవత్సరాల వారు జూనియర్–2గా విభజించి పోటీలు జరుపుతారు. 21–35 ఏళ్ల వరకు సీనియర్–1గా, 36–65 ఏళ్ల వారు సీనియర్–2 కేటగిరీల్లో జరిగే ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆసక్తిగలవారు 92464 40685ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. శుక్రవారం సంస్థ సభ్యులు అందే బాలచంద్రమౌళి, మడుపల్లి శ్రీనివాసరావు, బచ్చు రత్నకుమారితో కలిసి కార్యక్రమ పోస్టరును ఆవిష్కరించారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆర్వో కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ టీం సభ్యులతో పోలింగ్ విధులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సజావుగా జరగడంలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర అని, సెక్టార్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, కేటాయించబడిన పీఓలు, ఇతర పోలింగ్ సిబ్బందితో నిరంతరం సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటికే సెక్టార్, రూట్ అధికారులకు వైర్ లెస్ సెట్‌లు అందించామని, ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం సెట్ ద్వారా తెలియజేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తక్షణం సెట్ ద్వారా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్ల స్లిప్‌లు పంపిణీ జరిగిందని, బీఎల్‌ఓలతో సమీక్షించి ఎక్కడైనా అందకపోతే వెంటనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మౌలిక వసతులని పరిశీలించాలని, ఏ సమస్య ఉన్నా వెంటనే సంబంధిత ఏఈ దృష్టికి తీసుకురావాలని కోరారు. తూర్పు నియోజకవర్గంలోని 187 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుంచి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రిపోర్టింగ్ టీంని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కి అవసరమైన మెటీరియల్‌ను ఆదివారం ఉదయం నుంచే అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సెక్టార్ అధికారులు మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోనే పీఓలు, ఏపీఓలతో సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్ సమయంలో ఏ సమస్య ఎదురైనా పరిష్కారానికి క్విక్ రియాక్షన్ టీంని జీఎంసీ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏఆర్‌ఓలు భీమరాజు, ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు టి.వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మి, ఎంహెచ్‌ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామిరెడ్డి, సెక్టోరియల్ అధికారి బి.శ్రీధర్ బాబు, డీఈఈలు శ్రీధర్, రాము, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

**స్ట్రాంగ్ రూమ్ పరిశీలన**

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు పనులను వేగంగా చేపట్టాలని తూర్పు ఆర్వో కీర్తి చేకూరి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం సార్వత్రిక ఎన్నికల అనంతరం గుంటూరు తూర్పు, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎస్‌యూలో ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ మధుసూదన్, డీఈఈ రమేష్ బాబు, ఏసీపీ మురళి, ఎస్ఎస్ రాంబాబు, ఏఈ సునీల్ కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ మల్లేశ్వరరావు, సర్వేయర్ లోకేష్ పాల్గొన్నారు.

## యార్డులో 60,876 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 51,030 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 60,876 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది.

## రాజ్యాంగం, లౌకిక వాదంపై దాడి

- కార్పొరేట్‌లకే మోదీ వికసిత్ భారత్
- వామపక్షాల నేతలు సీతారాం ఏచూరి, డి.రాజా



లక్ష్మీపురం: క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న దేశాన్ని కాపాడుకోవడానికి ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. స్థానిక విజయ టాకీస్ ప్రాంగణంలోని శుక్రవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ ఓటు వినియోగించుకోవాలని కోరారు. మతోన్మాద ఫాసిస్టు విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి, ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నరేంద్ర మోదీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సెక్యులరిజం, ఫెడరిలిజంపై దాడి జరుగుతుందన్నారు. ఇటీవల మూడు విడతల ఎన్నికల్లో బీజేపీకి ప్రతి కూల వాతావరణం కనిపించడంతో ఖంగుతిన్న బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక పోకడలకు పాల్పడుతుందని విమర్శించారు. ప్రస్తుతం ఇండియా కూటమి గెలుపు అనివార్యమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ శాతం పెరిగిపోయిందని వారు చెప్పారు. ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ మస్తానవలిని గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫ్ఫార్, మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడారు.

## సిరా గుర్తు చూపితే..కంటి వైద్య సేవలు ఉచితం



తెనాలి: ఎన్నికల సంఘం పిలుపు మేరకు.. ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటం, సామాజిక సేవలో భాగంగా తమ ఆసుపత్రిలో కంటి వైద్య సేవలకు ఉచిత కన్సల్టేషన్ అందిస్తామని స్థానిక కొత్త పేటలోని శంకర నేత్ర చికిత్సాలయ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదెళ్ల స్వాతి తెలియజేశారు. ఉచిత కంటి వైద్యానికి సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం ఆసుపత్రిలో ఆవిష్కరించారు. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున ఆ రోజు ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లకు, ఈ నెల 31 వరకు ఉచిత కన్సల్టేషన్ ఇస్తామని తెలిపారు. ఓటు వేసినట్టుగా చేతివేలిపై గల సిరాచుక్కను చూపితే సరిపోతుందన్నారు. పరీక్షల అనంతరం అవసరమైనవారికి అతితక్కువ ఖర్చుతో కంటి శుక్లాల ఆపరేషను ఫాకో పద్ధతిలో చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు షేక్ జానీబాషా, సునీల్, చైతన్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు కళలు దోహదం



కళాకారులతో అతిథులు



ఓ చిన్నారి నృత్య ప్రదర్శన

- అట్టహాసంగా ప్రారంభమైన అయోధ్య రామ ఉత్సవ్–2024
- హాజరైన 22 మంది నాట్యాచార్యులు, సుమారు 240 కళాకారులు

నగరంపాలెం: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 22 మంది నాట్యాచార్యులు, వారి శిష్యులైన సుమారు 240 కళాకారులు ఒక చోటకు చేరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వారు ప్రదర్శిస్తున్న నృత్యాలకు బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కళా వేదిక, అన్నమయ్య కళావేదిక, వేదికగా మారాయి. భరతముని కూచిపూడి నృత్య కళాక్షేత్రం నిర్వహణలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అయోధ్య రామ ఉత్సవ్– 2024 రామ్‌లల్లా పురస్కార నృత్యోత్సవం శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ నాట్యాచారిణి వి.రంగమణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సీనియర్ నాట్యగురువు కృష్ణకుమారి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు కళలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. భారతదేశం కళలకు కాణాచి అని తెలిపారు. అందులో నాట్యం ప్రాధాన్యం వహించిందని చెప్పారు, కూచిపూడి నత్యానికి ఆంధ్ర రాష్ట్రం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. ఎందరో కళాకారులు, కూచిపూడి నృత్యాన్ని దేశ, విదేశాలలో ఖ్యాతి తెచ్చినట్లు కొనియాడారు. హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కూచిపూడి మరింత వెలుగులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనికై నాట్యాచార్యులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించే దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్ మాట్లాడుతూ భాషా, ప్రాంతీయ బేధాలు కళలకు అడ్డుకావని అన్నారు. కూచిపూడి నృత్యం ప్రతి ఇంట విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకులు భావన పెద్దప్రోలు మాట్లాడుతూ కరోనా వేళల్లోనూ ఆన్‌లైన్‌లో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి, ఆదరించారని పేర్కొన్నారు. ఆర్‌వీఆర్/జేసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మద్దినేని సుధాకర్, దేవస్థాన కమిటీ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య తదితరులు చిన్నారులు, నాట్యాచారులకు ధ్రువీకరణ పత్రాలు, /'ాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫీజుల చెల్లించేందుకు ఈనెల 31 వరకు అవకాశ ఉందని జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ ప్రథమ సంవత్సర ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజును రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 14, రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఈ నెల 22లోగా చెల్లించాలని సూచించారు.